


# "అల్లాహ్ ఒక్కడే" అనగానేమి?

ఒక్కడైన అల్లాహ్‌ను సంపూర్ణంగా విశ్వసించి, ఆయన్ని మాత్రమే ఆరాధించటాన్ని తౌహీద్ (అల్లాహ్ ఏకత్వం, ఏకదైవారాధన) అంటారు. ఇస్లాం ధర్మానికి పునాది ఈ తౌహీద్.

**అల్లాహ్ ఏకత్వం (తౌహీద్) అనే మాటలో మూడు విషయాలు ఇమిడి వున్నాయి:**

1. సృష్టిఅంతటికీ ఒకే దేవుడు అనే ఏకత్వం (తౌహీదె రుబూబియ్యత్)
2. ఆరాధనపరంగా అల్లాహ్ ఏకత్వం (తౌహీదె ఉలూహియ్యత్)
3. నామాలు, గుణగణాల పరంగా అల్లాహ్ ఏకత్వం (తౌహీదె అస్మా వస్–సిఫాత్)

## 1. సృష్టిఅంతటికీ ఒకే దేవుడు అనే ఏకత్వం (తౌహీదె రుబూ బియ్యత్)

అఖిల జగతికి అల్లాహ్‌యే ప్రభువు (రబ్) అనీ, సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, రక్షకుడు ఆయనేనని విశ్వసించటం. సమస్త సృష్టిరాశులను పర్యవేక్షించేవాడు, ప్రణాళికను రచించేవాడు కూడా ఆయనేనని మన స్ఫూర్తిగా నమ్మటం–ఇదే తౌహీదె రుబూబియ్యత్.

## 2.ఆరాధనపరమైన అల్లాహ్ ఏకత్వం (తౌహీదె ఉలూహియ్యత్)

సకల ఆరాధనలకు, ఉపాసనలకు, మొక్కుబడులకు అల్లాహ్ మాత్రమే అర్హుడని, అల్లాహ్ తప్ప వేరెవరూ వీటికి అర్హులు కారని విశ్వసించటం. ఇదే ఆరాధనపరమైన అల్లాహ్ ఏకత్వం (తౌహీదె ఉలూహియ్యత్)గా భావింపబడుతుంది. అంటే మన నమాజ్‌లు, దుఆలు (వేడుకోళ్ళు),

https://teluguislam.net

మొక్కుబడులు, నజరానాలు, సహాయం కొరకు అర్థించటం, ఖుర్బానీ (బలి) ఇవ్వటం, దాన ధర్మాలు చేయటం, ఉపవాసాలు పాటించటం, హజ్జ్ విధిని నెరవేర్చటం – ఇవన్నీ కేవలం అల్లాహ్ కొరకే జరగాలి. ఎందుకంటే దాసుల ఆరాధనలు స్వీకరించే ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ మాత్రమే. ఒక్క అల్లాహ్‌కు మాత్రమే ఆ హక్కు ఉంది.

## 3. నామాలు, గుణ విశేషాలపరంగా అల్లాహ్ ఏకత్వం (తౌహీదె అస్మా వ సిఫాత్)

అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకమైన ఉత్తమ నామాలను, ఆయన గుణ విశేషాలను విశ్వసించటాన్నే తౌహీదె అస్మా వ సిఫాత్ (నామాలు, గుణ విశేషాలపరంగా అల్లాహ్ ఏకత్వం) అంటారు. అంటే –

1. అల్లాహ్, ఆయన ప్రవక్త (స) తెలిపిన పేర్లు, గుణగణాలు తప్ప వేరితర పేర్లను, గుణగణాలను మనం అల్లాహ్‌కు ఆపాదించ కూడదు. ఉదా: 'విఘ్నేశ్వరుడు' అనే పదాన్ని తీసుకుందాం. షరీఅతు (ధర్మం)లో ఎక్కడా కూడా అల్లాహ్‌ను ఆ పేరుతో గుర్తుచేయబడలేదు. కనుక ఈ పేరునుగాని లేక ఇలాంటి వేరితర పేర్లనుగాని అల్లాహ్‌కు ఆపాదించరాదు. అలాగే యేసు, ముహమ్మద్, రామ, క్రిష్ణ. ఇవి అల్లాహ్ పేర్లు కావు. కనుక అల్లాహ్‌ను యేసు అనో లేక ముహమ్మద్ అనో, రామా అనో లేక క్రిష్ణా అనో పిలవటం సరికాదు. అదేవిధంగా ప్రపంచంలో గతించినవారు ఎంత గొప్పవారైనప్పటికీ వారి పేర్లతో అల్లాహ్‌ను సంబోధించటం సరి కానేకాదు.
2. అల్లాహ్ నామాలకు, గుణగణాలకు అల్లాహ్ మినహా వేరితరులు అర్హులు కారు. ఉదాహరణకు: అల్ కరీమ్ (పరమ ఉదాత్తుడు, కృపాకరుడు, పునీతుడు). ఈ గుణం ఒక్క అల్లాహ్‌కే ప్రత్యేకం.

https://teluguislam.net

3. దైవగ్రంథమైన ఖుర్‌ఆన్‌లోనూ, దైవప్రవక్త (స) ప్రవచనా (హదీసు) లలోనూ తెలుపబడిన అల్లాహ్‌ గుణగణాలలో ఎలాంటి మార్పులు చేర్పులు చేయకుండా, హెచ్చుతగ్గులు చేయకుండా, వాటిపట్ల అలక్ష్య ధోరణి ప్రదర్శించకుండా, వాటిలో పెడార్థాలు తీయకుండా, వాటిని సృష్టించబడినవాటికి ఆపాదించకుండా, వాటిని సృష్టితాలతో పోల్చకుండా ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించాలి, వాటిని ధృవపర చాలి.

ఉదాహరణకు: “కరుణామయుడు (అయిన అల్లాహ్‌) తన సింహాసనం(అర్ష్‌)పై ఆసీనుడై ఉన్నాడు” అని ఖుర్‌ఆన్‌ (20 : 5)లో చెప్పబడింది.

అంటే–కరుణామయుడు (అల్లాహ్‌) సింహాసనము (అర్ష్‌)ను అధీష్టించి ఉన్నాడనేది సత్యం. అది ఏడు ఆకాశాలపైన ఉన్నది. కొన్ని ప్రత్యేక సమయాల్లో మాత్రమే ఆయన మొదటి ఆకాశానికి వస్తాడు. అరఫా దినాన (జుల్‌ హిజ్జా 9వ తేదీన) ఆయన భూ ఆకాశానికి వస్తాడు. మహనీయ ముహమ్మద్‌ (సఅసం) వారు ప్రవచించిన దాని ప్రకారం రాత్రి మూడవ జామున కూడా అల్లాహ్‌ మొదటి ఆకాశంపైకి వస్తాడు. అయితే ఆ రావటమనేది ఆయన జ్ఞానానికనువుగా ఉంటుంది. ఈ స్థితి మన బుద్ధికి అందనిది. కాబట్టి ఎలా? ఏమిటి? అంటూ ఆ వైనం గురించి ప్రశ్నించటం, ఊహించటం, తమదైన శైలిలో వర్ణించటం తగదు.

ఇకపోతే ఆయన జ్ఞానం యావత్‌ సృష్టిని ఆవరించి ఉంది. అల్లాహ్‌ మనతో ఉన్నాడు అంటే అర్థం ఆ జ్ఞానపరంగానే కాని నిజంగానే అల్లాహ్‌ అస్తిత్వం మనవెంట ఉందని అర్థం ఎంతమాత్రం కాదు.

**“ఆయన్ని పోలిన వస్తువేదీ లేదు. ఆయన అంతా వినేవాడు, అన్నీ చూసేవాడు.”** ***(ఖుర్‌ఆన్‌ 42 : 11)***

అల్లాహ్‌కు గల కనే (చూచే), వినే గుణాల గురించి పై వాక్యంలో తెలుపబడింది. అయితే ఆ చూసే శక్తి మన చూసేశక్తి లాంటిది కాదు.

https://teluguislam.net

ఆ వినేశక్తి మనలాంటి వినేశక్తి కాదు. అల్లాహ్ మాదిరిగా ఎవరూ కనలేరు, వినలేరనే విషయం దీనిద్వారా మనకు బోధపడుతోంది. కాబట్టి ఈ కనే, వినే వైనాన్ని మనం ఇతరులతో పోలుస్తూ కాకి లెక్కలు వేయ కూడదు.

మహోన్నతుడైన అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

**"ఎవరినయితే నేను నా స్వహస్తాలతో సృష్టించానో....."**

***(ఖుర్ఆన్ 38 : 75)***

వేరొక చోట ఇలా సెలవీయబడింది:

**"వారి చేతులపై అల్లాహ్ చెయ్యి ఉంది."** ***(ఖుర్ఆన్ 48 : 10)***

అల్లాహ్‌కు చేతులున్నాయని పై వాక్యాల ద్వారా స్పష్టంగా అర్థమవు తోంది. అయితే ఆ చేతులు ఎలా ఉంటాయి? ఆయన చేయి ఇతరుల చేతులపై ఎలా ఉంటుంది? లాంటి ఊహాగానాలకు, పోలికలకు ఎంత మాత్రం తావులేదు.

–ఇదీ నిజ విశ్వాసుల నమ్మకం. దైవప్రవక్త నూహ్ నుండి ఇబ్రాహీం, మూసా, ఈసా (అలైహిస్సలాం) వరకూ, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) వరకూ – దైవప్రవక్తలందరూ దీన్నే విశ్వసించారు. కొంతమంది అల్లాహ్ అక్కడున్నాడు, ఇక్కడున్నాడు, సర్వత్రా ఉన్నాడని అంటుంటారు. ఈ భావన సరైందికాదు. పైగా ఈ భావన అపమార్గానికి దారితీస్తుంది. అల్లాహ్ స్వయంగా తాను సింహాసనాన్ని అధీష్టించి ఉన్నానని చెబుతున్న ప్పుడు దాన్ని మనం యధావిధిగా నమ్మాలి. అంతేగాని, దానికి మన సొంత భాష్యాలు జోడించకూడదు.

**'లా ఇలాహ ఇల్లల్లాహ్'** (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడు) అనే భావంలో తౌహీద్‌లోని పై మూడు అంశాలు కూడా ఇమిడి ఉన్నాయి.

ఇక తిన్నటిమార్గంపై నడవగోరేవారు అంతిమ దైవప్రవక్త అయిన

https://teluguislam.net

ముహమ్మద్ (సఅసం)ను అనుసరించటం తప్పనిసరి. ఆరాధనపరమైన అల్లాహ్ ఏకత్వం (తౌహీదె ఉలూహియ్యత్)లో ఇది కూడా అంతర్భాగమే.

"ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ సందేశహరుడన్న విషయాన్ని నేను ధృవపరుస్తున్నాను" అని మీరు అన్నారంటే దాని అంతరార్థం ఏమిటి? అల్లాహ్ ఆజ్ఞల తరువాత, అంటే అల్లాహ్‌గ్రంథమైన ఖుర్‌ఆన్ తరువాత మీకు అనుసరణీయులైన వారు ఎవరైనా ఉన్నారంటే వారు ముహమ్మద్ (సఅసం) మాత్రమే. ఖుర్‌ఆన్‌లోని అధ్యాయం–59, 7వ ఆయత్ ద్వారా గానీ, అధ్యాయం–3: 31వ ఆయత్ ద్వారా గానీ బోధపడే విషయం ఇదే కదా!

**(ఓ ప్రవక్తా!) ప్రజలకు చెప్పండి : "మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు.** ***(ఖుర్‌ఆన్ 3:31)***

**దైవ ప్రవక్త మీకు ఇచ్చిన దానిని (సంతోషంగా) పుచ్చుకోండి. ఆయన ఏ విషయం నుండైనా మిమ్మల్ని వారిస్తే, దాన్ని వదిలి పెట్టండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.** ***(ఖుర్‌ఆన్ 59:7)***

## మోడల్ ప్రశ్నలు

1) ఇస్లాం ధర్మానికి పునాది ఏది?
2) తౌహీద్ అంటే ఏమిటి?
3) తౌహీద్ రుబూబియ్యత్‌ను వివరించండి?
4) తౌహీద్ ఉలూహియ్యత్, తౌహీద్ అస్మా వ సిఫ్ఫాత్ గురించి వ్రాయండి?

https://teluguislam.net